
సాక్షి
అనంతపురం

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



వేదవతికి గర్భశోకం

కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతల ఇసుక దందాతో వేదవతి నదికి గర్భశోకం తప్పడం లేదు. IIలో



టమాట కిలో రూ.50

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.50 పలికింది. కనిష్టం రూ.23, సరాసరి రూ.35 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.3°/22.5°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కబోత కొనసాగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి.

న్యూస్‌రీల్

నిత్యావసర సరుకులు అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న జేసీ శివనారాయణశర్మ

అనంతపురం అర్బన్: నిత్యావసర సరుకులు అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ హెచ్చరించారు. మంగళవారం అధికారులు, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల స్థిరీకరణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశించిన మొత్తం కంటే అధిక మొత్తంలో సరుకులను నిల్వ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిత్యావసర సరుకుల దుకాణాలను ప్రతిరోజూ తనిఖీ చేయాలని సీఎస్‌డీటీలను ఆదేశించారు. వంట నూనెలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ ధరకంటే తక్కువకు వినియోగదారులకు అందించేందుకు హోల్‌సేల్ వ్యాపారులు, ఆయిల్ మిల్లర్లు సహకరించాలని కోరారు. వంటనూనెలు వినియోగదారులకు అందుబాటు ధరలో ఉండేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏసీఎస్ మిల్లును పరిశీలించిన జేసీ

గుంతకల్లు: దశాబ్దాల క్రితం మూతపడిన ఆంధ్ర కో ఆపరేటివ్ స్పిన్నింగ్ (ఏసీఎస్) మిల్‌ను మంగళవారం జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ పరిశీలించారు. మిల్ పరిసరాల్లో కలియ తిరిగారు. పాడైన మిషనరీని పరిశీలించారు. మిల్లు మూతపడడానికి గల కారణాలను చేనేత జౌళి శాఖ సిబ్బంది, అక్కడ పని చేస్తున్న వాచ్‌మెన్‌లను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో మిల్లును నిర్మించారు? వాటి సర్వే నంబర్లు? మిల్లు స్థలంలో అనధికారంగా నివాసముంటున్న వారి వివరాలపై నివేదిక సిద్ధం చేయాలని తహసీల్దార్ రమాదేవిని ఆదేశించారు. వాచ్‌మెన్, సిబ్బంది జీతాభత్యాలను అడిగి తెలుసుకుని సకాలంలో జీతాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ శ్రీనివాస్, జౌళిశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న డీఏఓ

బొమ్మనహాళ్: ఇటీవల కురిసిన వర్షానికి బొమ్మనహాళ్ మండలంలో నీట మునిగిన పంట పొలాలను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ సాయికుమార్ పరిశీలించారు. ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, సిద్దరాంపురం గ్రామాల్లో వారు పర్యటించారు. నష్టపోయిన పంటల వివరాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. పంట నష్టాలపై నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతామని రైతులకు తెలిపారు. సిద్దరాంపురంలో జొన్న వేసి నష్టపోయిన రైతులకు ప్రత్యామ్నాయంగా జొన్న, పప్పుశనగ విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తామన్నారు. ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. బుధవారంతో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గోపాల్ పాల్గొన్నారు.

ముగిసిన ఆంధ్రా రంజీ జట్టు శిక్షణ శిబిరం



కోచింగ్ క్యాంప్‌లో పాల్గొన్న రంజీ ఆటగాళ్లు

అనంతపురం: స్థానిక అనంత క్రీడాగ్రామం వేదికగా ఆర్డీటీ ఆధ్వర్యంలో గత నెల 26న ప్రారంభమైన ఆంధ్రా రంజీ జట్టు శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఫిట్‌నెస్ టెస్ట్, ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్ సెషన్‌తో పాటు ఏపీ, త్రిపుర రంజీ జట్ల మధ్య సన్నాహక మ్యాచ్‌లు నిర్వహించారు. నాగపూర్‌లో అక్టోబర్ 11న విదర్భ- ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య రంజీ టోర్నీ ప్రారంభం కానుంది. ఆంధ్రా జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్న రికీ భుయి, కేఎస్ భరత్, హనుమ విహారి, అశ్విన్ హెబ్బార్, శశికాంత్, స్టీఫెన్, నితీష్ కుమార్ శిక్షణలో పాల్గొన్నారు. హెడ్ కోచ్ టిను యోహానన్, బ్యాటింగ్ కోచ్ జ్ఞానేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ ఎంఎస్ విక్రమ్ వర్మ, ఫీల్డింగ్ కోచ్ శివ కుమార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం.. మాదే రాజ్యం



- వైన్ షాపులు దక్కించుకునేందుకు 'తమ్ముళ్ల' అడ్డగోలు వ్యవహారం
- ఔత్సాహికులకు ఫోన్లలో బెదిరింపులు
- షాపు దక్కించుకున్నాక ఎలా బిజినెస్ చేస్తారో చూస్తామంటూ హెచ్చరికలు
- పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులూ వారికే వంత పాడుతున్న వైనం
- 'పచ్చ' నేతల తీరుతో భారీగా తగ్గిన దరఖాస్తులు
- 3 వేలు అంచనా వేస్తే ఇప్పటికి వచ్చింది 1,310 దరఖాస్తులే
- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు తెలుగు తమ్ముళ్లు చేస్తున్న అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు, లాటరీలో వస్తే వ్యాపారం చేసుకోవచ్చు. కానీ, 'మేమే దరఖాస్తు చేసుకోవాలి, మేమే మద్యం వ్యాపారం చేయాలి' అన్న రీతిలో టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది ఔత్సాహికులు ఎమ్మెల్యేలు, వారి అనుచరులకు భయపడి దరఖాస్తు చేయడానికి ముందుకు రావడం లేదు. ఎక్కువ దరఖాస్తులు రాకపోతే ప్రభుత్వానికి ఆదాయం భారీగా పడిపోయే అవకాశం ఉంటుంది.

బార్ ఓనర్లతో సిండికేట్..

జిల్లాలో మొత్తం 136 మద్యం షాపులు ఏర్పాటు కానుండగా అనంతపురం అర్బన్‌లోనే 40 వరకూ ఉంటాయి. 40 శాతం మద్యం వ్యాపారం జరిగేది ఇక్కడే. ఇక్కడ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దరఖాస్తుదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు తెలిసింది. నగరంలో అన్ని షాపులనూ దక్కించుకోవాలని ఎత్తుగడలు వేస్తున్నారు. ముందుగా పథకం ప్రకారం నలుగురు బార్ ఓనర్లతో కుమ్మక్కయ్యారు. సింధూర, ఎస్వీ, ఎస్ఎస్ఎస్, లక్ష్మి బార్ల యాజమాన్యాలతో సిండికేట్ అయి, మిగతా బార్ల యాజమాన్యాలను బెదిరిస్తున్నట్టు సమాచారం.

పోలీసులతో ఫోన్లు చేయించి..

నేటి (బుధవారం) సాయంత్రం 5 గంటలతో మద్యం షాపుల దరఖాస్తు గడువు ముగుస్తుంది. సిండికేట్ కారణంగా అనుకున్న మేర దరఖాస్తులు రాలేదు. నేరుగా కొంతమంది పోలీసులే ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత మూడు రోజులుగా జిల్లాలో మద్యం సిండికేట్‌పైనే టీడీపీ నాయకులు కసరత్తు చేస్తున్నారు. లాటరీలో ఎవరికి షాపు దక్కినా అది మనదే అయి ఉండాలన్న ధ్యేయంతో ముందుకెళుతున్నారు.

1,310 దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 136 షాపులకు గాను బుధవారం సాయంత్రానికి 1,310 దరఖాస్తులు వచ్చాయి. 4 షాపులకు ఇప్పటివరకూ ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మద్యం షాపునకు అత్యధికంగా 24 దరఖాస్తులు వచ్చాయి. బుక్కరాయసముద్రం పరిధిలోని ప్రతి షాపునకు సగటున 12 దరఖాస్తులు వచ్చినట్టు తేలింది. ఎక్సైజ్ అధికారులు మొత్తమ్మీద మూడు వేల దరఖాస్తులు రావచ్చని అంచనా వేయగా.. తెలుగు తమ్ముళ్ల సిండికేట్ వ్యవహారం కారణంగా 1,500కు మించి రావని భావిస్తున్నారు.

రింగ్ లీడర్ సుధాకర్ నాయుడు

అనంతపురంలో లిక్కర్ సిండికేట్ లీడర్‌గా సుధాకర్ నాయుడు వ్యవహరిస్తున్నట్టు టీడీపీలోని ఓ వర్గం ఆరోపిస్తోంది. 2014–19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో ఈయన ఇష్టారాజ్యంగా మద్యం వ్యాపారం చేశారని, ఇప్పుడు మళ్లీ వ్యవహారం నడిపిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం అక్రమాలకు సుధాకర్ నాయుడిని ఆద్యుడిగా చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం ఈయన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేకు ప్రధాన అనుచరుడిగా ఉన్నట్టు టీడీపీ నేత ఒకరు చెప్పారు. ఇటీవలే అనంతపురం క్లబ్‌ను తన గుప్పిట్లో పెట్టుకోవాలని, అక్కడ పేకాట ఆడించాలని విఫలయత్నం చేసినట్లు సదరు నేత తెలిపారు. తాజాగా బార్ యాజమాన్యాలతో సిండికేట్ చేయించడం, దరఖాస్తు దారులను బెదిరించడం సుధాకర్‌నాయుడు కనుసన్నల్లో జరుగుతోందని, లిక్కర్ డాన్‌గా పేరుగాంచిన ఈయనకు పోలీసులూ జీహుజూర్ అంటున్నారని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం ఆరోపిస్తోంది.

విత్తన పప్పుశనగ అందేదెన్నడో..?

అనంతపురం అగ్రికల్చర్: విత్తన పప్పుశనగపై సబ్సిడీని 25 శాతానికి తగ్గించి భారం మోపిన కూటమి సర్కారు.. నేడు పంపిణీ కార్యక్రమాన్ని కూడా ఆలస్యం చేస్తుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో ఈనెల 4 నుంచి రాయితీ విత్తన పప్పుశనగ పంపిణీ ప్రారంభించారు. అక్కడ 72 వేల క్వింటాళ్లు కేటాయించినా ప్రాసెసింగ్, సరఫరా, నిల్వ వేగవంతం చేసి సకాలంలో రైతులకు విత్తనం అందిస్తున్నారు. ఇక్కడ మాత్రం కేటాయించింది 37,500 క్వింటాళ్లే అయినా ఇప్పటికీ ఏపీ సీడ్స్ ద్వారా సరఫరా ప్రారంభించకపోవడం చూస్తే వ్యవసాయశాఖ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. 22 మండలాల పరిధిలో పంపిణీ చేస్తామని ప్రకటించగా.. ఆర్ఎస్‌కేల్లో ఇప్పటికే 15 వేల క్వింటాళ్లకు రైతులు తమ వాటా చెల్లించి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇటీవల వర్షాలు పడటంతో పంట సాగుకు సిద్ధంగా ఉన్నారు. సన్న చిన్నకారు రైతులు ప్రభుత్వం ఇచ్చే రాయితీ విత్తనంపై ఆధారపడి ఉన్నందున ఇబ్బందులు పడుతున్నారు. సరఫరా ఆలస్యమవుతున్న అంశంపై వ్యవసాయశాఖ ఎందుకు దృష్టి పెట్టడం లేదో అర్థం కావడం లేదు. గత ఖరీఫ్, ఇటీవల ప్రత్యామ్నాయ విత్తన పంపిణీకి సంబంధించి సరఫరాదారులకు కూటమి సర్కారు చెల్లింపులు చేయనందున సమస్య ఎదురవుతున్నట్లు చెబుతున్నారు. అయితే, ఉమ్మడి కర్నూలు జిల్లాలో పంపిణీ ఎలా చేస్తున్నారనే దానిపై వ్యవసాయశాఖ అధికారులు నోరుమెదడం లేదు. తమ కష్టనష్టాల గురించి మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి తీసికట్టుగా తయారైందని రైతులు వాపోతున్నారు.

గతంలో 40 శాతం రాయితీ..

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 37,500 క్వింటాళ్ల జేజీ-11 రకం విత్తన పప్పుశనగ కేటాయించింది. గతేడాది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు 40 శాతం రాయితీ ఇవ్వగా.. దాన్ని కూటమి సర్కారు 25 శాతానికి కుదించేసింది. 37,500 క్వింటాళ్ల పంపిణీకి సంబంధించి జిల్లా రైతులపై రూ.6 కోట్ల మేర అదనంగా భారం మోపింది.

మంత్రి ఇలాకాలో దాహం కేకలు



తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ రాస్తారోకో చేస్తున్న చిన్నముష్టూరు గ్రామస్తులు

- తాగునీటి కోసం రోడ్డెక్కిన చిన్నముష్టూరు గ్రామస్తులు

ఉరవకొండ: తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొనడంతో గ్రామస్తులు, మహిళలు రోడ్డెక్కి నిరసన తెలిపిన ఘటన మంగళవారం మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో జరిగింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఈ ఘటన జిల్లావ్యాప్తంగాచర్చనీయాంశమైంది.వివరాలు.. దాదాపు నెల రోజులుగా చిన్నముష్టూరు గ్రామానికి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో కడుపు మండిన గ్రామస్తులు మంగళవారం 42వ జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో జాతీయ రహదారిలో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా చిన్నముష్టూరు మహిళలు మాట్లాడుతూ నెల రోజులవుతున్నా తాగునీరు సరఫరా చేయకుంటే ఏం తాగి బతకాలని ధ్వజమెత్తారు. అధికారులు తమ గ్రామం వైపు కన్నెత్తి చూడటం లేదని వాపోయారు. తాగునీటి ఎద్దడి పరిష్కారానికి మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

పాఠశాల రుణం తీర్చుకుందాం

- కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: విద్యను అందించిన పాఠశాలలు, కళాశాలల రుణం తీర్చుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విద్య, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివి ప్రస్తుతం మంచి స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయా విద్యాసంస్థలకు అవసరమైన సదుపాయాల జాబితాను గ్రూప్‌లో ఉంచి అభివృద్ధికి తోడ్పడేలా చూడాలన్నారు. జిల్లాలో చదివి నేడు వివిధ హోదాల్లో ఉన్న అధికారులతో ఆయా పాఠశాలలు, కళాశాలల వాట్సాప్ గ్రూప్‌ను ఏడు రోజుల్లో తయారు చేయాలని ఆదేశించారు.డబ్బు రూపంలో కాకుండా వస్తు రూపంగా సేకరించేలా చూడాలన్నారు. ప్రణాళిక సిద్ధం చేసుకున్న తరువాత కార్యాచరణ ప్రారంభించాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, సేవాభావంతో ఉన్న వారి నుంచి వాట్సాప్ గ్రూప్ ద్వారా సహకారం, సహాయం కోరాలని చెప్పారు. సహాయం చేసిన వస్తువులకు రసీదు ఇవ్వాలన్నారు. పెద్ద వస్తువులైతే బహూకరించిన వారి పేరు దానిపై ఉండేలా చూడాలన్నారు. చదివిన పాఠశాల, కళాశాలకే కాకుండా ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థలకు సహాయం చేయవచ్చన్నారు. సహాయం చేసే కార్యక్రమాన్ని తమతోనే ప్రారంభించాలని అధికారులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఓ కృష్ణయ్య, సర్వ శిక్ష అభియాన్ ఏడీ నాగరాజు, డీవీఈఓ వెంకటరమణ నాయక్, ఏఎంఓ చంద్రశేఖర్, గిరిజన సంక్షేమాధికారి రామాంజనేయులు, బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూ కొఠారి, ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, సాంఘిక సంక్షేమ గురుకులాల డీసీఓ ఉదయశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సొసైటీల్లో ఎరువుల అమ్మకాలు చేపట్టాలి

జిల్లాలోని అన్ని కో-ఆపరేటివ్ సొసైటీల్లో ఎరువుల అమ్మకాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కో-ఆపరేటివ్ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 34 కో-ఆపరేటివ్ సొసైటీలు ఉంటే 11 సొసైటీల్లో మాత్రమే ఎరువుల అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. మిగిలిన 23 సొసైటీల్లోనూ అమ్మకాలు చేపట్టేందుకు నెల రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన ఎంపీఎఫ్‌సీ (మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్లు) గోదాములను సంబంధిత అధికారులకు నెలరోజుల్లో అప్పగించాలని చెప్పారు. 50 గోదాముల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. సొసైటీల్లో రుణాలు తీసుకున్న రైతుల వివరాల కంప్యూటరైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సొసైటీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీఓ అరుణకుమారి, డీసీసీబీ సీఈఓ సురేఖారాణి, మత్స్య శాఖ డీడీ శ్రీనివాసనాయక్, డీపీడీఎం తేజస్విని, వ్యవసాయ శాఖ ఏడీ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల దందాలు కనిపించలేదా బాబూ?

- 80 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక దోచేశారు
- నాలుగు నెలల్లో భవన నిర్మాణ రంగం నిర్వీర్యం
- ఇసుక దందాలో రెవెన్యూ అధికారులు, పోలీసులకు భాగస్వామ్యం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: "గతంలో రూ.15 వేలకు దొరికే ఇసుక నేడు రూ.22 వేలకు చేరుకుంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, రాప్తాడు, ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలోనే ఇసుక దందా జరుగుతోంది. సీఎం చంద్రబాబు, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న లోకేష్‌కు ఇదంతా తెలియడం లేదా..? లేకుంటే మీకూ, మీ ఎమ్మెల్యేలకూ ఏమైనా అగ్రిమెంట్ జరిగిందా?" అంటూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంపద సృష్టిస్తానంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సీఎం అయ్యాక ప్రజాప్రతినిధులకు దోచిపెట్టే పనిలో నిమగ్నమయ్యారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్ల నాలుగు నెలల్లోనే నిర్మాణ రంగం కుదేలైందన్నారు. ఈ రంగంపై ఆధారపడిన రాష్ట్రంలోని 60 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉండేదని, ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచే అంతా దోపిడీ చేశారని విమర్శించారు. ఉచిత ఇసుక విధానం అభాసుపాలైందంటూ సీఎం చంద్రబాబు సీరియస్ అయినట్లు ప్రచారం జరిగిందని, ఆ తర్వాత జిల్లా కలెక్టర్, ఎస్పీలు స్టేట్‌మెంట్ ఇచ్చారని, వారికి తెలియకుండానే ఇసుక తరలిపోతోందా అని ప్రశ్నించారు. 'మీకు చేతకాకుంటే నా వద్దకు వస్తే ఎక్కడి నుంచి ఇసుక తరలిపోతోందో చెబుతా' అని పేర్కొన్నారు. ఎప్పుడైనా పత్రికల్లో కథనాలు వస్తే ఎద్దుల బండ్లను పట్టుకుని స్టేషన్లలో పెడుతున్నారని, ఇసుక దోపిడీ వ్యవహారంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు భాగస్వాములయ్యారని ఆరోపించారు. ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు కూడా బెదిరించే పరిస్థితికి వచ్చారన్నారు. తాము గెలవకపోతే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యేవారా? అని చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు ఇసుక దోపిడీ చేస్తూ చాలెంజ్‌లు విసురుతున్నా ఎవరూ కిమ్మనడం లేదన్నారు. వైఎస్సార్ జిల్లా ఏటూరు నుంచి అనంతపురం జిల్లా కేంద్రానికి నిత్యం టిప్పర్లలో ఇసుక వస్తోందన్నారు.

మేధావులే ఆశ్చర్యపోయేలా బెదిరింపులు..

మేధావులు సైతం ఆశ్చర్యపోయేలా ఎమ్మెల్యేలు బెదిరింపులకు దిగుతున్నారన్నారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకుంటే వ్యాపారాలు చేసుకోలేరని అంటున్నారన్నారు. ఏకంగా సీఐలు, డీఎస్పీలే ఫోన్లు చేస్తూ దరఖాస్తు చేయకుండా అడ్డుపడుతున్నారన్నారు. మద్యం షాపులకు డీడీలు కట్టి వేసుకుంటే మంచిది కాదంటూ స్టేషన్లకు రావాలని సూచిస్తున్నారన్నారు. గతంలో కర్ణాటక, తెలంగాణ నుంచి కూడా వచ్చి మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునేవారని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు.

ప్రజల పక్షాన నిలబడతాం..

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యాపారులు, కాంట్రాక్టర్లు కూడా పని చేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందన్నారు. ఎస్పీ, కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు మద్యం, ఇసుక విషయంలో నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. గతంలో ఎక్కడైతే ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని కొందరు ఎన్జీటీకి వెళ్లారో.. నేడు అదే ప్రాంతంలో ఇసుక దోపిడీ జరుగుతోందన్నారు. కొందరు ప్రజాప్రతినిధులు బరితెగించి చివరకు మద్యం షాపుల వద్ద అమ్ముకునే తినుబండారాల విషయంలో కూడా గుత్తాధిపత్యం ఇస్తామంటున్నారన్నారు. 'ఇంతకంటే సిగ్గుచేటు మరొకటి ఉందా? బెల్టు షాపుల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ప్రజలన్నీ గమనిస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి' అని అనంత హెచ్చరించారు.

జిల్లాకు వర్షసూచన

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 5 రోజుల్లో తేలిక పాటి నుంచి చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్ బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 32.5–34.8, రాత్రి ఉష్ణోగ్రతలు 23.5–24.6 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 80–83 శాతం, మధ్యాహ్నం 65–75 శాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

చూసిన కనులదే భాగ్యం

జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారి నామస్మరణ మార్మోగుతోంది. జగజ్జనని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులను కటాక్షించారు. అమ్మవారిని కనులారా దర్శించుకున్న భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



గుంతకల్లులో చాముండేశ్వరి అలంకరణలో వాసవీమాత



అనంతపురంలోని కొత్తూరు శాలలో అమ్మవారిని దర్శించుకుంటున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కె. సురేష్‌రెడ్డి దంపతులు

వేదవతికి గర్భశోకం

- గుండ్లపల్లి హగరి నుంచి యథేచ్ఛగా ఇసుక తరలింపులు
- ట్రాక్టర్‌కు రూ.4 వేలు చొప్పున వసూలు
- గంటల వ్యవధిలోనే చేతులు మారుతున్న రూ.లక్షలు
- చోద్యం చూస్తున్న అధికారులు



మొలకాల్మూరు రోడ్డు సీతప్ప మిల్లు వద్ద వెళుతున్న ఇసుక ట్రాక్టర్



బాదనహాళ్ సమీపంలోని హగరి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

రాయదుర్గం: వేదవతి నదికి గర్భశోకం తప్పడం లేదు. కూటమి సర్కార్ ఏర్పాటైన తర్వాత నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికారాన్ని అడ్డు పెట్టుకుని టీడీపీ నేతలు చెలరేగి పోటాపోటీగా ఇసుక అక్రమ దందాకు తెరలేపారు. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా ఒకదాని వెనుక ఒకటి ట్రాక్టర్లు ఇసుక లోడుతో తరలిపోతున్నాయి. అడ్డుకోవాల్సిన అధికారులు అక్రమార్కుల కొమ్ము కాస్తుండడం గమనార్హం.

టీడీపీ నేతలకు కాసుల వర్షం

ఉచిత ఇసుక విధానం కాస్త టీడీపీ నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. రాత్రి, పగలు తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ట్రాక్టర్లలో, రాత్రి పూట టిప్పర్ల ద్వారానూ ఇసుక తరలిస్తూ రూ.లక్షల్లో సొమ్ము వెనకేసుకుంటున్నారు. అధికారులు అడ్డుకుంటే ముఖ్య నాయకుల పేర్లు చెప్పి దోపిడీ పర్వం కొనసాగిస్తున్నారు. జుంజురాంపల్లి స్టాక్ యార్డులో ఇసుక ఖాళీ కావడంతో గుండ్లపల్లి, భూపసముద్రం, రంగచేడు, కలుగోడు, బీటీపీ హగరి నుంచి రోజూ పెద్ద ఎత్తున ఇసుక అక్రమ తరలింపు కొనసాగుతోంది. రాయదుర్గం వరకూ ట్రాక్టర్ ఇసుక ధర రూ.4 వేలు పలుకుతోంది. స్టాక్‌యార్డులో ఇసుక ఉన్నంత వరకూ రూ.2 వేలకే లభించేది. ప్రస్తుతం అదనంగా రూ.2 వేలు చెల్లించాల్సి వస్తోంది.

ఖాళీ అవుతున్న వంకలు, వాగులు

ఇసుక అక్రమ రవాణాతో వేదవతి నదీ పరివాహక ప్రాంతంతో పాటు వాగులు, వంకలు ఖాళీ అవుతున్నాయి. అధికారికంగా ఎక్కడా రీచ్‌లు తెరవకపోయినా టీడీపీ నాయకులు, వారి అనుయాయులు బరితెగించి ఇసుక అక్రమ దందాకు తెరదీశారు. నెలకు రూ.కోట్లలో మూట గట్టుకుంటున్నారు. గుమ్మఘట్ట మండలంలోని భూపసముద్రం, రంగచేడు, కలుగోడు, గుమ్మఘట్ట, బీటీపీ, సిరిగేదొడ్డి ఫారెస్ట్, డి హీరేహాళ్ మండలంలో బాదనహాళ్, నాగలాపురం, హొసగుడ్డం, డి హీరేహాళ్ చెరువు ప్రాంతం, కణేకల్లు మండలం రచ్చుమర్రి, కళేకుర్తి, నాగేపల్లి, మాల్యం, బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్, బండూరు, కళ్లుదేవనహళ్లి, బొల్లనగుడ్డం, రాయదుర్గం మండలం కెంచానపల్లి, వేపరాళ్ల, గుండ్లుపల్లి తదితర ప్రాంతాల నుంచి రోజూ వందలాది టిప్పుల ఇసుక రాయదుర్గంతో పాటు పొరుగున ఉన్న కర్ణాటకకూ తరలిపోతోంది.

పడిపోతున్న భూగర్భ జలాలు

వేదవతి నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదముందని ఆయా ప్రాంతాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే లోటు వర్షపాతం కారణంగా వందలాది బోర్లు అడుగంటిపోతున్నాయని వాపోతున్నారు. హగరి పరివాహక ప్రాంతాల్లోనూ భూగర్భ జలం అడుగంటే స్థితికి చేరుకుంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాగునీటికి సైతం ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇసుక ఎక్కడైనా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు చేపడతాం. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచేలా సిబ్బందికి ఆదేశాలు జారీచేస్తాం. అనుమతుల్లేకుండా ఎక్కడైనా ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం.
– రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

నిఘా ఉంచుతాం

ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉచిత ఇసుక అందేలా కృషి చేస్తాం. వేదవతి హగరి నదీ పరివాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తరలిపోకుండా ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఆ పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం.
– వెంకటేశులు, మైనింగ్ డీడీ, అనంతపురం

టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే దందా

బెళుగుప్ప: మండలంలోని నరసాపురం, రమనేపల్లి, గుండ్లపల్లి గ్రామాల సమీపంలో ప్రవహించే వేదవతి హగిరి నది నుంచి టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాలకు ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నరసాపురం సమీపంలోని హగిరి నదీ పరివాహక ప్రాంతంలోకి వెళ్లేందుకు బెళుగుప్ప మండల టీడీపీ అధ్యక్షుడు ప్రసాద్ నేతృత్వంలోనే జేసీబీతో దారిని ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కో ఇసుక ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.3వేల నుంచి దూరాన్ని బట్టి రూ.5వేల వరకూ వసూలు చేస్తున్నారు. కాలువపల్లి వద్ద పెన్నా నదిలోనూ ఇసుక అక్రమ తవ్వకాలు కొనసాగిస్తున్నారు. హగిరి, పెన్నా నది నుంచి రోజూ 50కు పైగా ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక తరలిపోతోంది.



నరసాపురం వద్ద హగిరి నదిలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేస్తున్న దారి

రిమాండ్‌కు వంచకుడు

రాప్తాడు రూరల్: ప్రేమ పేరుతో వంచించిన ఓ యువకుడు చివరకు కటకటాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం మండలం రేగాటిపల్లికి చెందిన హనుమంతు బెంగళూరులో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అనంతపురంలో తాను డిగ్రీ చదువుకునే సమయంలో పరిచయమైన రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమలోకి లాగాడు. పెళ్లి చేసుకుంటాననడంతో ఆ యువతి కూడా ప్రేమను అంగీకరించింది. డిగ్రీ పూర్తయిన తర్వాత సదరు యువతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్వేషణలో బెంగళూరుకు చేరుకుంది. ఆ సమయంలో అక్కడే ఉన్న హనుమంతు పెళ్లి చేసుకుంటానని ఆశ పెట్టి పలుమార్లు శారీరకంగా ఆమెను వాడుకున్నాడు. చివరకు ఆమె ఇంటికి కూడా వచ్చి వెళ్లాడు. కొన్ని రోజులు గడిచిన తర్వాత హనుమంతు మొహం చాటేశాడు. పెళ్లి పేరు ఎత్తకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో తాను మోసపోయినట్లుగా గుర్తించిన యువతి ఇటీవల ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ విజయకుమార్, పోలీసులు హనుమంతు కోసం గాలింపు చేపట్టి మంగళవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

వేర్వేరు ప్రాంతాల్లో రేషన్ బియ్యం పట్టివేత



యాడికిలో పట్టుబడిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

యాడికి/గార్లదిన్నె: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని యాడికి, గార్లదిన్నె పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన యాడికి సీఐ ఈరన్న మంగళవారం తెల్లవారుజామున యాడికిలోని కోన రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆటో, 407 వాహనాల్లో 98 బస్తాల్లో (ఒక్కో బస్తాలో 50 కేజీలు) తరలిస్తున్న 49 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను సీజ్ చేసి పీఎస్‌కు తరలించారు. బియ్యం తరలిస్తున్న యాడికి మండలం పిన్నేపల్లె నివాసి మహేంద్ర, రొక్కరూకల సూర్యనారాయణ, కృష్ణమనాయుడు, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం జక్కసానికుంట్లకు చెందిన 407 డ్రైవర్ రఘురాం, అదే మండలం రంగాపురం గ్రామానికి చెందిన సుంకన్నపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని డీటీ సూర్యనారాయణకు అప్పగించారు. అలాగే గార్లదిన్నె మండలం మర్తాడు క్రాస్‌లో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా స్వాధీనం చేసుకున్నారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి, విచారణ చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

గుత్తి: స్థానిక ఫోర్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో తాడిపత్రిలోని టీచర్స్ కాలనీకి చెందిన పాల వ్యాపారి రమేష్‌బాబు(55) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏడాది క్రితం చిన్నకుమారుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి మనోవేదనకు గురైన రమేష్‌బాబు మంగళవారం గుత్తి ఫోర్ట్ ఆర్‌ఎస్‌కు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై గుత్తి జీఆర్పీ హెచ్‌సీ రామిరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బీజేపీ నేతలు రూ.50 లక్షలు అడిగారు

- 15 ప్లాట్లూ ఇవ్వాలని బెదిరించారు
- ఒప్పుకోకపోవడంతో మా ఇళ్ల పునాదులు, షెడ్లు కూల్చేశారు
- విలేకరుల సమావేశంలో ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ నేతలు



మాట్లాడుతున్న ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేంద్ర

ధర్మవరం అర్బన్: '' పట్టణంలోని సర్వే నంబర్ 650–2లో ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ సభ్యులకు ప్రభుత్వం గతంలో స్థలం కేటాయించింది. అందులో కొందరు ఇళ్లు కట్టుకునేందుకు పునాదులు తవ్వుకున్నారు. మరికొందరు షెడ్లు వేసుకుని ఉంటున్నారు. ఇటీవల కొందరు బీజేపీ నాయకులు వచ్చి తమకు రూ.50 లక్షల నగదు 15 ప్లాట్లు ఇవ్వాలని మమ్మల్ని బెదిరించారు. మేము ఒప్పుకోకపోవడంతో మా ఇళ్ల పునాదులు, షెడ్లు కూల్చేశారు'' అని ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేంద్ర, కార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి లదీఫ్, ట్రెజరర్ ఇస్మాయిల్ తదితరులు పేర్కొన్నారు. మంగళవారం వారు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సర్వే నంబర్ 650–2లోని స్థలం గత 15 ఏళ్లుగా వివాదంలో ఉంది. 2023లో కోర్టు మా అసోసియేషన్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్న ప్లంబర్లు ప్లాట్లు వేసుకుని పునాదులు తీసుకుంటున్నారు. మరికొంతమంది రేకుల షెడ్లు వేసుకున్నారని తెలిపారు. అయితే బీజేపీ నాయకులైన గొడుగు నాగరాజు, సోమశేఖర్, బాలకృష్ణయాదవ్ తదితరులు వచ్చి రూ.50 లక్షల నగదు, 15 ప్లాట్లు ఇవ్వాలని తమను బెదిరించారన్నారు. తాము అందుకు ఒప్పుకోకపోవడంతో దౌర్జన్యంగా హిటాచీతో పునాదులు, పిల్లర్లు, షెడ్లు కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ దురుద్దేశంతో ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు కాని వారితో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారన్నారు. రాజకీయ ప్రోద్బలంతో నిజమైన ప్లంబర్లకు కేటాయించిన ప్లాట్లను దౌర్జన్యంగా లాక్కోవాలని చూస్తున్నారని వాపోయారు. తాము అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని 15 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చామని, ఇన్నేళ్లూ రాని వారు ఇప్పుడు ప్లంబర్ల పేరుతో బీజేపీ నాయకులతో కలిసి దౌర్జన్యంగా చేస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు జుబేర్, జావీద్, చంద్ర, వీరారెడ్డి, అంజి, కిష్ట, మాధవ్, జిలాన్, బాషా, ఆంజనేయులు, హసీమ్, అనిల్‌కుమార్, అజయ్‌కుమార్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాలు విజయవంతం చేస్తాం

- కలెక్టర్ వినోద్‌కుమార్



డిప్యూటీ సీఎంతో నిర్వహించిన వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు కలెక్టర్ వినోద్‌కుమార్ భరోసానిచ్చారు. మంగళవారం విజయవాడ నుంచి కలెక్టర్లు, ఉపాధి హామీ సమన్వయ అధికారులతో డీసీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పంచాయతీ వారోత్సవారాల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. జిల్లా నుంచి కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులూ పాల్గొన్నారు. ఉపాధి పనులు, వారోత్సవాల నిర్వహణకు చేపట్టిన చర్యలను కలెక్టర్ వివరించారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనంపై రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్‌కి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కూలీలకు ఉపాధి పనులు కల్పించే విషయంలో ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

30 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులు పెట్టుకున్న ఆశలను కూటమి ప్రభుత్వం అడియాశలు చేస్తోందని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 27 శాతం ఐఆర్ ప్రకటించిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఐఆర్ ప్రకటించక పోవడం బాధాకరమన్నారు. తక్షణమే 12వ పీఆర్సీ కమిషన్ వేసి ఉపాధ్యాయులకు డీఏ బకాయిలు చెల్లించాలని జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి జి .శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు గోవిందరెడ్డి, వెంకటరమణ, గోపాల్, కృష్ణానాయక్, హెచ్. రామకృష్ణ, విశ్వనాథరెడ్డి, వెంకటరెడ్డి, ఓబిరెడ్డి, శంకరనారాయణ, రవీంద్రారెడ్డి, శంకరనారాయణ పాల్గొన్నారు.





డీఎస్సీ 'ఎం' ప్యానల్‌మెంట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం రూరల్: డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ ఇవ్వడానికి ఆసక్తి ఉన్న శిక్షణా సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బు కొఠారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకునే సంస్థలు గత రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలి. సెంటర్ ద్వారా వంద మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికై ఉండాలి. మూడేళ్ల టర్నోవర్ సరాసరి రూ.40 లక్షలు ఉండాలి. ఆసక్తి ఉన్న డీఎస్సీ శిక్షణా సంస్థలు ఈ నెల 21వ తేదీలోపు https://apeprocurement.gov.in/వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు అందజేయాలి.

మద్యం మత్తులో ఉరేసుకున్నాడు!

కంబదూరు: మండలంలోని ములకనూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు (40) మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పాలవాయి గ్రామానికి చెందిన రామాంజనేయులు 15 ఏళ్ల క్రితం ములకనూరుకు వలస వచ్చి గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తన కున్న గొర్రెలనూ అమ్ముకున్నాడు. దీంతో కుటుంబ పోషణ భారమైంది. సోమవారం రాత్రి పుల్‌గా మద్యం సేవించిన రామాంజనేయులు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం ఉదయం గ్రామ శివారులో చెట్టుకు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న రామాంజనేయులు గుర్తించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, విషయం తెలుసుకున్న ఎంపీపీ తిమ్మరాజమ్మ, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు తదితరులు రామాంజనేయులు మృతదేహాన్ని సందర్శించి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

పవర్ గ్రిడ్ స్థల పరిశీలన

గుంతకల్లు రూరల్: మండలంలోని తిమ్మాపురం, దోనిముక్కల గ్రామాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పవర్ గ్రిడ్ స్థలాన్ని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ మంగళవారం పరిశీలించారు. పవర్ గ్రిడ్ ఏర్పాటుకు దాదాపు 62 ఎకరాల స్థలం అవసరం కాగా దోనిముక్కల సమీపంలో ఖాళీగా ఉన్న 32 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు పక్కనే తిమ్మాపురం సమీపంలో ఉన్న 9 ఎకరాల భూమిని ఇప్పటికే అధికారులు గుర్తించారు. మిగిలిన భూమి కోసం మంగళవారం జేసీ శివనారాయణ శర్మ, పవర్ గ్రిడ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. వీలైనంత త్వరలో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జేసీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన పవర్‌గ్రిడ్ కోసం సేకరించిన స్థలంలో మొక్క నాటి నీరుపోశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న జేసీ శివనారాయణ శర్మ

పంటల సాగులో మెలకువలు పాటించాలి

నూతన వ్యవసాయ పద్ధతులు, పంట సాగులో మెలకువలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే మెరుగైన దిగుబడులు సాధించవచ్చునని రైతులకు జేసీ శివనారాయణశర్మ సూచించారు. ఇందుకోసం వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గుంతకల్లు మండలం కసాపురం, స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పంట సాగుకు ముందు మట్టి పరీక్షలు చేయించుకుంటే క్రిమి సంహారక మందుల వాడకం తగ్గుతుందని ఏఓ స్వాతి తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి

వజ్రకరూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అధికారులను జేసీ శివనారాయణశర్మ ఆదేశించారు. మంగళవారం వజ్రకరూరులోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీలు చేశారు. రికార్డులతో పాటు వాటిని భద్రపరిచిన గదిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రికార్డులు భద్రపరిచే గదిని శుభ్రంగా ఉంచాలని సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నయాజ్‌అహమ్మద్, డీటీ నరేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

కూడేరు: కార్యాలయంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిని జేసీ శివనారాయణశర్మ ఆదేశించారు. మంగళవారం ఆయన కూడేరు తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డుల గదిని పరిశీలించారు. రికార్డులు భద్రపరిచే గదికి తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యలు పరిష్కారం కాలేదంటూ ఎవరూ జిల్లా కేంద్రానికి రాకూడదని హెచ్చరించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్, సిబ్బందిని హెచ్చరించారు.

లక్ష్య సాధనలో మార్కెట్ కమిటీలు డీలా

- అనంతపురం మినహా మిగతా యార్డుల్లో తగ్గిన ఆదాయం
- రూ.12.06 కోట్లకు గానూ రూ.4.75 కోట్లు పన్ను వసూళ్లు
- పాలక వర్గాల నియామకాలపై స్పష్టత ఇవ్వని 'కూటమి'

అనంతపురం అగ్రికల్చర్: సెప్టెంబర్ నెలాఖరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి మార్కెటింగ్‌శాఖ నిర్దేశించిన లక్ష్య సాధనలో మార్కెట్ కమిటీలు డీలా పడ్డాయి. అనంతపురం మార్కెట్ యార్డు మినహా మిగిలిన ఎనిమిది కమిటీలూ లక్ష్యానికి దూరంగా పయనిస్తున్నాయి. ఈ ఏడాది జిల్లాలో ఉన్న 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా వివిధ రూపాల్లో పన్ను వసూళ్ల కింద రూ.12.06 కోట్ల ఆదాయం గడించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా... సరిగ్గా ఆరు నెలలు ముగిసిన తర్వాత 39 శాతంతో రూ.4.75 కోట్లు వసూళ్లయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కరోనా మహమ్మారితో రెండేళ్లు మినహాయిస్తే గత మూడేళ్లు అవలీలగా లక్ష్యం సాధించిన మార్కెటింగ్‌శాఖ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 'సారీ' అనే పరిస్థితి నెలకొంది.

తగ్గిన రూ.77 లక్షలు

గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి రూ.5.52 కోట్లకు పైగా ఆదాయం గడించిన మార్కెటింగ్‌శాఖ ఈ సారి రూ.77 లక్షల లోటు చూపిస్తోంది. అనంతపురం మార్కెట్‌యార్డు లక్ష్యం రూ.4.60 కోట్లు కాగా ప్రస్తుతానికి 56 శాతంతో 2.61 కోట్ల మేర సాధించింది. అయితే గతేడాది ఇదే సమయంతో పోల్చుకుంటే అనంతపురం యార్డులోనూ రూ.10 లక్షలు లోటు కనిపిస్తోంది. గతేడాది కన్నా రాయదుర్గం, రాప్తాడు, శింగనమల, తాడిపత్రి, ఉవరకొండ మార్కెట్ కమిటీల్లో రూ.9 లక్షల నుంచి రూ.17 లక్షల వరకు తక్కువగా వసూలైంది. ప్రస్తుతమున్న పరిస్థితి అంచనా వేస్తే అనంతపురం, శింగనమల మాత్రమే లక్ష్యం సాధించే పరిస్థితి ఉండగా మిగతావన్నీ కష్టమంటున్నారు. 56 శాతం వసూళ్లతో అనంతపురం టాప్‌లో ఉండగా ఆ తర్వాత శింగనమల 42 శాతం, తాడిపత్రి 33 శాతం, ఉరవకొండ 32 శాతంతో కొంచెం పర్వాలేదనిపిస్తున్నాయి. ఆ తర్వాత కళ్యాణదుర్గం 27 శాతం, గుంతకల్లు 23 శాతం, రాయదుర్గం 20 శాతం సాధించగా... గుత్తి 17 శాతం, రాప్తాడు 13 శాతం వసూళ్లతో లక్ష్యానికి ఆమడదూరంలో ఉన్నాయి.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

మార్కెట్ కమిటీల స్థితిగతులపై ఆర్జేడీ నెలవారీ సమీక్షలు చేస్తున్నా... ఏడీఎం రోజువారీ పర్యవేక్షణ కొనసాగిస్తున్నా... కమిటీల్లో ఆదాయానికి క్రమంగా గండిపడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మార్కెట్ కమిటీలకు పాలక వర్గాలను నియమించే క్రమంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ఇప్పటి వరకూ దృష్టి సారించకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో యార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు, రైతు సేవలు, వసూళ్లు బాగా తగ్గుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

రూరల్‌లో 'పొలం పిలుస్తోంది'



రాచానపల్లిలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ రవి, ఏఓ శశికళ

అనంతపురం అగ్రికల్చర్‌: అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి, రాచానపల్లిలో ఏడీఏ ఎం.రవి, ఏఓ శశికళ మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వేరుశనగ, కంది, ఆముదం తదితర పంట పొలాలను పరిశీలించి చీడపీడల నివారణ, ఇతరత్రా యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు చేశారు. మట్టి పరీక్షల ప్రాధాన్యత, కౌలురైతులకు సీసీ ఆర్సీల ద్వారా ప్రయోజనాలను వివరించారు.

పాలస్తీనా ప్రజలపై దాడులు ఆపాలి

అనంతపురం టవర్‌క్లాక్‌: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులు వెంటనే ఆపాలని ఆల్ ఇండియా తంజీమ్ –ఏ–ఇన్సాఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు అలీపీరా కోరారు. మంగళవారం స్థానిక సప్తగిరి సర్కిల్ వద్ద ఇన్సాఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అల్లీపీరా మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్ 7న అమెరికా ప్రోద్బలంతో పాలస్తీనాపై దాడులు చేశారన్నారు. అందులో 86 వేల మందికి పైగా మరణించారన్నారు. ఐక్యరాజ్య సమితి నిబంధనలు తుంగలో తొక్కి అమెరికా, వాటి మిత్ర దేశాలు పేట్రేగిపోతున్నాయన్నారు. ప్రపంచ ప్రజలంతా పాలస్తీనాకు సంఘీబావం తెలపాలన్నారు. నాయకులు సంతోష్ కుమార్, శ్రీనివాస్, నరసింహయాదవ్, చాంద్‌బాషా, సూఫీ ఖాజా, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



స్టేట్ రీసోర్స్‌పర్సన్లకు శిక్షణ ఇస్తున్న సీటీఐఓ లక్ష్మానాయక్

అనంతపురం అగ్రికల్చర్‌: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై స్థానిక ప్రకృతి వ్యవసాయం కార్యాలయంలో స్టేట్ రీసోర్స్‌పర్సన్లకు 8 రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేటివ్ ఆఫీసర్ (సీటీఐవో) వి.లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా గో ఆధారిత ఉత్పత్తుల ఆధారంగా ప్రకృతి వ్యవసాయ విస్తరణ, వాటి లాభాలు, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ అంశాలను తెలియజేశారు. నేలల రకాలు, వాటి స్వభావాలు, వాటి సంరక్షణ అంశాలు, అగ్రో క్లైమాటిక్ జోన్స్ జలవనరులు, ప్రాజెక్టులు, రైతుల అవసరాలు, రుతుపవనాలు, వర్షపాతం, తేమశాతం, నేలల్లో తేమ సంరక్షణ విధానాన్ని వివరించారు. మానవులు, పశువులకు ప్రకృతి వ్యవసాయంతో కలిగిన సంబంధం, రసాయన వ్యవసాయంతో ప్రజారోగ్యం, పర్యావరణ పరంగా జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పొందిన రీసోర్స్ పర్సన్లకు సర్టిఫికెట్లు అందజేశారు.

'పోక్సో' కేసులో నిందితుడికి రిమాండ్

రాప్తాడురూరల్‌: పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్ విధించారు. అనంతపురం రూరల్ మండలం జాకీర్‌కొట్టాలులో ఏడేళ్ల చిన్నారి పట్ల అదే కాలనీకి చెందిన రవీంద్ర అలియాస్ రవి రెండు రోజుల కిందట అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం జాకీర్ కొట్టాలులోని ఆర్చి వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడిని అరెస్ట్ చూపిస్తున్న వన్‌టౌన్ పోలీసులు

అనంతపురం: నగరంలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ జి.రాజేంద్రనాథ్‌యాదవ్ మంగళవారం తెలిపారు. బుడ్డప్పనగర్‌కు చెందిన శికారి మల్లప్ప 47 కర్ణాటక టెట్రా ప్యాకెట్ల మద్యం అమ్ముతుండగా ఎస్‌ఐ జయరాం నాయక్ అరెస్ట్ చేశారన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

నేడు మండల మీట్

చెన్నేకొత్తపల్లి: మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివశంకరప్ప మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

బొమ్మల కొలువు.. సంస్కృతికి నెలవు

- సంప్రదాయాలను కాపాడుతున్న పాత తరం
- కనువిందు చేస్తున్న బొమ్మలు



కొలువైన అనంతపద్మనాభస్వామి



కనువిందు చేస్తున్న, శ్రీకృష్ణుడు,గోపికల బొమ్మలు

అనంతపురం కల్చరల్‌: ఒకప్పుడు దసరా వేడుకలొస్తున్నాయంటే ఇంటింటా అందమైన బొమ్మలు కొలువుదీరేవి. ఆడపిల్లల సరదాలంతా దసరా పర్వదినాలు తీర్చేవి. సెల్‌ఫోన్ ఆటలే లోకంగా మారిపోయిన ఈరోజుల్లో చాలా మందికి పండుగ అంటే సెలవుగా మాత్రమే తెలుసు. వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచడానికే ఏర్పాటు చేసే బొమ్మల కొలువులు అరుదుగా మారిపోయాయి. భవిష్యత్తు తరాల వారికి సంప్రదాయాలను అందించాలన్న ఉద్దేశంతో పాతతరం వారు ఇప్పటికీ బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నారు. పెద్దలు చెప్పదలచుకున్న సమస్త విషయాలను బొమ్మలతో మాట్లాడిస్తున్నట్లు ఒకే గదిలో కళ్లకు కట్టినట్టున్న ఘట్టాలు బొమ్మల కొలువులో మాత్రమే ఆవిష్కారమవుతాయి. దసరా వైశిష్ట్యాన్ని ఘనంగా చాటే బొమ్మల కొలువులను నగరంలోని కాశీవిశ్వేశ్వరాలయం, తపోవనం వేదమాత గాయత్రీ దేవస్థానాలతో పాటూ నగరానికి చెందిన డాక్టర్ హరీంద్రనాథ్, రాధ, సాయినగర్ రెండోక్రాస్‌కు చెందిన లతాఖన్నన్ కొనసాగిస్తున్నారు.

దేశవిదేశాల నుంచి సేకరణ

కోవూరునగర్‌కు చెందిన హరీంద్రనాథ్ వారింట్లోకి అడుగుపెట్టగానే బొమ్మల కొలువు మరో ప్రపంచానికి తీసుకెళ్తుంది. ఏటా ఒక కొత్త పురాణ గాథలతో ఆ ఇల్లు సుందరంగా మారుతుంది. ఈ ఏడాది దక్షిణ భారతదేశంలో కొలువైన పలు పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యాన్ని తెలిపేలా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. దశావతారాలు, బృందావనంలో గోపికా కృష్ణుల సందడి, రాజుల కాలం నాటి రాజు, రాణి కోటలు, వరలక్ష్మీ వ్రతం తెలిపే సుందర కథలు, హరేరామ హరేకృష్ణ అంటూ సాగే ఇస్కాన్ విశిష్టత ఇక్కడ చూడొచ్చు. దేశంలోని కొయంబత్తూరు, కాంచీపురం, ఏటికొప్పాక, కొండపల్లి, తిరువనంతపురం, తిరుపతి ప్రాంతాలలో స్వయంగా వెళ్లి సేకరించుకున్న బొమ్మలతో పాటూ ఇండోనేషియా నుంచి తెచ్చిన వివిధ జంతువుల బొమ్మలు కనువిందు చేస్తున్నాయి.



సాయినగర్‌లో బొమ్మలకొలువు ఏర్పాటు చేసిన లతాఖన్నన్



కోవూర్‌నగరలో రాధ ఇంట్లో బొమ్మల కొలువు



సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయుడు

పంపనూరులో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పంచామృతాభిషేకాల అనంతరం స్వామి వారికి పట్టు వస్త్రాలతో బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళ హారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో అన్నదానం చేపట్టారు.

14న హుండీ కానుకల లెక్కింపు

ఈ నెల 14వ తేదీన ఉదయం 9 గంటలకు హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ సిబ్బంది మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఇందులో పాల్గొనాలనుకున్న భక్తులు సంప్రదాయ దుస్తుల్లో రావాలని సూచించారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



హనుమద్ వాహనంపై శ్రీవారు

అనంతపురం కల్చరల్‌: అధిక సంఖ్యలో తరలి వస్తున్న భక్తజనం గోవింద నామస్మరణతో నగరంలోని శ్రీనివాసనగర్, హౌసింగుబోర్డ్లని వేంకటేశ్వరాలయాలు ప్రతిధ్వనిస్తున్నాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లోభాగంగా మంగళవారం స్థానిక ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నవగ్రహ హోమం, దీక్షా హోమం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా సాగాయి. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతుడై శ్రీవేంకటేశ్వరుడు హనుమద్ వాహనంపై విహరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన అర్చక బృందం హరికిషోర్ శర్మ, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై అవగాహన లేకుండా మాట్లాడొద్దు

- ఎమ్మెల్యే దగ్గుపాటిపై మేయర్ వసీం ధ్వజం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్‌: నగరాభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి అవగాహన లేకుండా అవగాహన లేకుండా మాట్లాడొద్దని మేయర్ వసీం పేర్కొన్నారు. ఇటీవల ఎమ్మెల్యే దగ్గుపాటి హమాలీ కాలనీలోని పాఠశాలలో పర్యటించి నగరాభివృద్ధిపై చేసిన ఆరోపణలను మేయర్ ఖండించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హమాలీ కాలనీలోని అంబేడ్కర్ పాఠశాలకు నాడు–నేడు కింద రూ.30 లక్షలు విడుదల కాగా అందులో 60 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. హెచ్‌ఎం ద్వారా పాఠశాల కమిటీ పనులు చేస్తుందన్న విషయం తెలుసుకోకుండా ఎమ్మెల్యే మాట్లాడడం సరికాదన్నారు. 2014 నుంచి 2019 వరకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠశాలల పరిస్థితిని పోస్టర్ల ద్వారా చూపించారు. నగరంలో విడత నాడు –నేడు కార్యక్రమం కింద రెండు విడతల్లో 51 పాఠశాలల్లో 15.7 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఎమ్మెల్యే నివాసానికి దగ్గరున్న మారుతీనగర్‌లోని ఝాన్సీ లక్ష్మీబాయి పాఠశాలలో నాడు–నేడు ద్వారా పాఠశాలలను ఎలా అభివృద్ధి చేశామో వారి పార్టీ నేతలను అడిగి తెలుసుకోవాలన్నారు. నగరంలో నీటి సమస్యపై ఎమ్మెల్యే అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ హయాంలో అప్పట్లో ఎంపీగా ఉన్న అనంత వెంకటరామిరెడ్డి హయాంలో రాబోయే 40 ఏళ్ల వరకు నీటి సమస్య లేకుండా పీఏబీఆర్ నుంచి నగరానికి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.1045 కోట్లతో నగరంలో అభివృద్ధి జరిగిన విషయం ప్రజలకు తెలుసన్నారు. వంద రోజుల కూటమి ప్రభుత్వంలో నగరంలో ఆగిన పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని హితవు పలికారు. కార్పొరేటర్లు కమల్‌భూషణ్, నరసింహులు, సైఫుల్లాబేగ్, నాయకుడు చింతకుంట మధు పాల్గొన్నారు.

'ఆశ్రయ' దేవికి ఉమెన్ ఐకాన్ అవార్డు



అవార్డునందుకుంటున్న ఆశ్రయ అనాథాశ్రమ నిర్వాహకురాలు దేవి

అనంతపురం కల్చరల్‌: సామాజిక సేవా కార్యకర్త, ఆశ్రయ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు దేవి ఉమెన్ ఐకాన్ అవార్డునందుకుంది. ఉమెన్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవా కార్యకర్తలను ప్రతిష్టాత్మక అవార్డు కోసం ఎంపిక చేసింది. అయితే వృద్ధులకు ఇబ్బంది కాకూడదని వెళ్లలేకపోయిన దేవికి నిర్వాహకులు నగరంలోనే అవార్డునందించే ఏర్పాట్లు చేశారు. స్థానిక రామచంద్రానగర్‌లో మంగళవారం తరిమెల రాజు దర్శకత్వంలో వచ్చిన 'బడి పిలుస్తోంది' లఘు చిత్ర ప్రదర్శన జరిగింది. వందలాది మంది ప్రేక్షకులు ఉత్సాహంగా చిత్రాన్ని తిలకించారు. అనంతరం నటీనటులు, చిత్ర యూనిట్ అభినందన కార్యక్రమంలో వక్తలు యూనిట్ కృషిని అభినందించారు. ఈ సందర్భంగా దేవికి ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, సీనియర్ రచయిత పతికి రమేష్ నారాయణ, టీవీ, సినీ నటుడు రమేష్ నీల్ చేతుల మీదుగా అవార్డునందించి సత్కరించారు. చిత్ర యూనిట్ సభ్యులు కేపీ రాజు, దర్శకుడు తరిమెల రాజు, సుధాకర్, సామాజిక సేవా కార్యకర్త ఏజీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆశ్రయ నిర్వాహకులు యర్రగుంట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



గొరిదిండ్ల వద్ద రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆత్మకూరు: పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఏఓ సుచరిత రైతులకు సూచించారు. మంగళవారం పంపనూరు, గొరిదిండ్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ కందిలో చీడపీడల నివారణ చర్యలను తెలియజేశారు. శనగపచ్చ పురుగు లార్వా నివారణకు ఎకరాకు 10–15 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలని, శనగపచ్చ పురుగుల ఉనికిని గమనించేందుకు ఎకరాకు 4 లింగార్షక బుట్టలను అమర్చాలన్నారు. గుడ్లు తొలి దశ నివారణకు 5 శాతం వేప గింజల కషాయాన్ని పిచికారీ చేయాలన్నారు. పురుగు ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు 1.5 గ్రాముల ఎసిఫేట్ లేదా 2.మి.లీ, కిన్వాల్ ఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కందిలో ఆకు పచ్చ పురుగు నివారణకు 1.6 మి.లీ. మైనో క్రోటోఫాస్ లేదా 2మి. లీ. క్వినాల్పాస్,2.5 మి.లీ, క్లోరోపైరిఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వేరుశనగలో ఆకుమచ్చ తెగుల నివారణకు 1.0మి.లీ, టేబ్యేకోనజోల్ లేదా 2 గ్రాముల క్లోరోదాలోనిల్ మందును లీటరు నీటిలో పలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఈఓ సుజిత, ఏఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

దసరా ఆనందంగా జరుపుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్‌: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో 50వ డివిజన్ కార్పొరేటర్ గురుశేఖరబాబు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా దసరా పర్వదినాలలో కార్పొరేటర్ చేస్తున్న ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలందుకున్నారు. మాజీ కార్పొరేటర్ బిందుప్రియ, జేసీఎస్ జిల్లా అధ్యక్షులు చెన్నం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను గౌరవించాలి



శాంసంగ్ షోరూమ్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం అర్బన్‌: శాంసంగ్ సంస్థ భారత దేశ కార్మిక చట్టాలని గౌరవించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. తమిళనాడు పెరంబదూర్ శాంసంగ్ ప్లాంట్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు మంగళవారం నగరంలోని శాంసంగ్ షోరూమ్ ఎదుట ఆ సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలంటూ రెండు నెలలుగా పెరంబదూర్‌లోని శాంసంగ్ ప్లాంట్‌లో పనిచేస్తున్న 2 వేల మంది కార్మికులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణ కొరియాలో పనిచేసే కార్మికులకు 13 వేల డాలర్లు వేతనం, భారత్‌లో పని చేసే కార్మికులకు వేతనం 300 డాలర్లు ఇవ్వడం దారుణమన్నారు. కార్మిక చటాలను అమలు చేసేలా కేంద్రం ఆ సంస్థ యాజమాన్యాన్ని ఆదేశించాలన్నారు. సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటనారాయణ, నాయకులు ఎర్రిస్వామి, తిరుమలేష్, నాగరాజు, ఆజాంబాషా, భాస్కర్, జిలాన్‌బాషా, శ్రీనివాసమూర్తి, కుమార్, హరి, పెద్ద కుళ్లాయప్ప పాల్గొన్నారు.

డీఈఓ అక్రమాలపై విచారణ జరిపించాలి

అనంతపురం ఎడ్యుకేషన్‌: జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీపై వస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎల్లన్న, ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధ్యక్షుడు రామాంజనేయులు, నగేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. కంచే చేను మేసినట్లు విద్యాశాఖ ఆస్తులు, నిధులకు, విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన డీఈఓ, అవినీతిపరులతో చేతులు కలిపి అవినీతి సొమ్ములో అతి పెద్ద వాటా కొట్టేసిందని ఆరోపించారు. వరలక్ష్మీ జిల్లాకు వచ్చినప్పటి నుంచి పైకి రూల్స్ చెబుతూ ఉపాధ్యాయులు, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు, డీఈఓ, సమగ్ర శిక్ష కార్యాలయాల సిబ్బందిని వేధిస్తూ ముప్పుతిప్పలు పెడుతోందని పేర్కొన్నారు. సెక్టోరియల్ అధికారులను రిలీవ్ చేసే విషయం, రిక్రూట్‌మెంట్ విషయంలో ఆమె నిర్వాకంపై మీడియా కోడై కూస్తున్నా, విద్యార్థి, ప్రజా, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నా కనీస చర్యలు తీసుకోవడం లేదని గుర్తు చేశారు. డీసీఈబీలో డీఈఓ, సెక్రటరీ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ముగ్గురూ కలిసి రూ.లక్షల సొమ్మును దిగమించారనే ఆరోపణలున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అక్రమాలపై విచారణ చేయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'రాచపాలెం'కు జీవిత సాఫల్య పురస్కారం



అనంతపురం కల్చరల్‌: అనంత సాహితీ లోకాన్ని అభ్యుదయ భావజాలంతో నడిపిస్తూ ఆధునిక కవిత్వానికి, విమర్శకు ప్రత్యేక స్థానాన్ని తెచ్చిన ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి స్పందన అనంత కవుల వేదిక అందించే జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు సంస్థ నిర్వాహకులు చం.శాస్త్రి ఓ ప్రకటనలో విడుదల చేశారు. పాలి, రెండు ప్రపంచాలు వంటి కవితా సంపుటాలకు గాను పురస్కారం అందిస్తున్నామని తెలిపారు. త్వరలో అనంత వేదికగానే డాక్టర్ రాచపాలెంకు నగదు బహుమతితో పాటూ పురస్కారాన్ని , సత్కారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపిక కావడంపై సీనియర్ రచయితలు డాక్టర్ శాంతినారాయణ, తరిమెల అమరనాథరెడ్డి, జిల్లా రచయితల సంఘం, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి, కబీర్ అకాడమీ, తెలుగు వెలుగు సాహితీ సంస్థల ప్రతినిధులు రాచపాలెంకు అభినందనలు తెలిపారు.

అంకితభావంతో పని చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా

చెన్నేకొత్తపల్లి: అంకితభావంతో పని చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెల్వియా సాల్మన్ వైద్య సిబ్బందికి సూచించారు. ఎన్‌ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ రవినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

అనంతపురం కల్చరల్‌: తపోవనంలోని వేదమాత గాయత్రీ దేవి ఆలయంలో బుధవారం ఉదయం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు ప్రసాద్, నాగరాజు తెలిపారు. ఇదిలా ఉండగా హెచ్చెల్సీకాలనీలోని శ్రీనసనకోట ముత్యాలమ్మ ఆలయంలో సరస్వతీ పూజ నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ గురుశేఖరబాబు తెలిపారు. పలక, బలపం లేదా పుస్తకం తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

భారత వాయుసేన ఆవిర్భావ దినోత్సవం

అనంతపురం: హెచ్చెల్సీ కాలనీలోని మాజీ సైనికుల సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో భారత వాయుసేన 92వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. 1965 పాకిస్తాన్, 1971 బంగ్లాదేశ్ యుద్ధాల్లో భారతీయ వాయుసేన సాధించిన విజయాలను గుర్తు చేశారు. సర్జికల్ స్ట్రైక్‌లో భారతీయ వాయుసేన పాత్ర అమోఘమని ప్రశంసించారు. మాజీ సైనికులు ఈశ్వరయ్య, బీఏ హుస్సేన్, పెంచలయ్య, వై.ప్రసాద్, సిద్ధన్న, నబీరసూల్, ఇస్మాయిల్ షఫీ పాల్గొన్నారు.

కరుణించు తల్లీ.. కనకదుర్గమ్మ

అనంతపురం కల్చరల్‌/ అనంతపురం అర్బన్‌/ ఆత్మకూరు/ కనగానపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాలు అనంతపురంతోపాటు కనగానపల్లి, ఆత్మకూరు మండలాల్లో వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



వేపాకుల అలంకరణలో ఉమానగర్ రేణుకా ఎల్లమ్మ



పాతూరు అమ్మవారి శాలలో శివపార్వతుల అలంకరణ



నెమలి అలంకరణలో తపోవనంలోని వేదగాయత్రీమాత



పంపనూరులో ప్రత్యేక అలంకరణలో పార్వతీ దేవి



కొత్తూరు అమ్మవారిశాలలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం సలీమ్, డిప్యూటీ మేయర్ వాసంతి



ధనలక్ష్మి అలంకరణలో కొత్తకోట సుంకులమ్మ అమ్మవారు



మామిళ్లపల్లిలో పూజలందుకొన్న పెద్దమ్మ తల్లి

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
బుధవారం ॥ 9-10-2024

ప్రమాదాల సముద్రం మీద 8 నెలల పాటు ప్రపంచ దేశాలు తిరిగి రావడానికి ఇద్దరు సాహస నేవీ మహిళా అధికారులు దిల్నా, రూపా అక్టోబర్ 2న గోవా నుంచి బయలుదేరారు.
కేవలం వారిద్దరు మాత్రమే ఉండే ఈ సాహసభరిత యాత్రలో వారు తోడు తీసుకెళుతున్నవి ఏమిటి? వారికి తోడుండేవి ఏమిటి?
ఇంత సాహసం చేసే వీరిని చూస్తే ప్రతి అమ్మాయిలోనూ కలగదా సముద్రమంత సాహస భావన!


రూప దిల్నా

● శక్తి

ఆటుపోట్లకు వెరవని 'షి'జర్నీ

'గమ్యం ఎలాగూ ముఖ్యమే. కాని ప్రయాణం కూడా ముఖ్యం. ఈ యాత్రలోని ప్రతి క్షణాన్నీ ఆస్వాదించండి' అని అక్టోబర్ 2న గోవాలో జెండా ఊపి భవిష్యత్ చరిత్రలో చిరస్థాయిగా నిలబడనున్న 'నావికా సాగర్ పరిక్రమ–2'ను ప్రారంభించారు నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి. కేవలం ఇద్దరు మహిళా నేవీ ఆఫీసర్లు ఐఎన్ఎస్వి తారిణి పేరున్న సెయిల్ బోట్లో ఎనిమిది నెలల పాటు చేయనున్న ఈ సాహసయాత్ర విజయవంతం కావాలని ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ కోరుకున్నారు.

ఐదు అంచెల యాత్ర

యాభై ఆరు అడుగుల పొడవుండే సెయిల్ బోట్ తారిణిలో కమాండర్లు దిల్నా, రూప ఒకరికి ఒకరు తోడుగా నిలిచి మొత్తం 23000 నాటికల్ మైళ్లు అంటే 40000 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. అక్టోబర్ 2న గోవా నుంచి బయలుదేరిన వీరు ఈ యాత్రను ఐదు భాగాలుగా చేస్తారు.

1. గోవా నుంచి ఆస్ట్రేలియా 2.ఆస్ట్రేలియా నుంచి న్యూజిలాండ్ 3. న్యూజిల్యాండ్ నుంచి ఫాక్ల్యాండ్ ఐలాండ్స్ (దక్షిణ పసిఫిక్ సముద్రం) 4.ఫాక్ల్యాండ్ నుంచి సౌత్ ఆఫ్రికా 5. సౌత్ ఆఫ్రికా నుంచి గోవా. భారతీయ మహిళలు అత్యంత శక్తిమంతులని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేందుకు సాగుతున్న ఈ యాత్ర కోసం తరిణికి సారథిగా లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా.కే వ్యవహరిస్తుండగా.. మరో లెఫ్టినెంట్ కమాండర్ రూపా సారథ్యం వహిస్తున్నారు.

మైక్రోప్లాస్టిక్స్పై పరిశోధన

'నావికా సాగర్ పరిక్రమ–2' మన స్త్రీ శక్తిని నిరూపించడానికే కాదు 'నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ'తో అనుసంధానమై సముద్ర జలాల్లోని మైక్రోప్లాస్టిక్స్ను అధ్యయనం చేయడానికి కూడా ఉపయోగపడనుంది. అలాగే 'వైల్డ్లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా'తో కలిసి సముద్రాలలోని పుష్పపత్రాలు, భారీ సముద్ర జీవులపై కూడా పరిశోధనకు అవసరమైన సమాచారం కూడా సేకరిస్తారు. వీటన్నింటికి వీలుగా 'తారిణి'ని సిద్ధం చేశారు. ఈ బోట్ ముందు భాగంలో మాస్ట్సెయిల్స్ ఉంటాయి. వెనుక భాగంలో రెండు స్టీరింగ్ వీల్స్, ఆటో పైలట్ సిస్టమ్, నెలకు 20 జీబీ వినియోగించుకునే సౌకర్యంతో కూడిన శాటిలైట్ యాంటెన్నా ఉంటుంది. సముద్ర జలాల్ని శుద్ధి చేసి గంటకు 30 లీటర్ల మంచినీరు ఇవ్వగల ఆర్వో ప్లాంట్ అమర్చారు. అవసరమైన సందర్భాల్లో వినియోగించుకునేందుకు 22 తాళ్లను అందుబాటులో ఉంచారు. ల్యాప్టాప్లు, మ్యూజిక్ సిస్టం సైతం బోట్లో ఉన్నాయి.

బోట్ తయారీలో అధికభాగం ఫైబర్ గ్లాస్ను ఉపయోగించారు. వీరి యాత్రను జీపీఎస్ విధానం ద్వారా ట్రాక్ చేస్తూ ప్రయాణం ఎలా సాగుతోందో భారత నౌకాదళం నిరంతరం పర్యవేక్షిస్తుంటుంది.

సోదరి ఇచ్చిన పాండా బొమ్మతో

'ప్రయాణం చేయడానికి భయం లేదని చెప్పడం లేదు. కానీ అంతకుమించిన ఆత్మవిశ్వాసం కూడా ఉంది. ఈ ప్రయాణంలో నాకు తోడుగా ఉంటుందని నా సోదరి పాన్పాన్ అని పిలుచుకునే పాండా బొమ్మ ఇచ్చింది. దీంతో పాటు ఖగోళశాస్త్రవేత్త కార్ల్సాగన్ రచించిన పుస్తకాలు తోడు తీసుకెళ్తున్నాను' అంది లెఫ్టినెంట్ కమాండర్ రూపా ఈ సందర్భంగా.

అమ్మ చేసిన ఊరగాయలతో

'సముద్రం ఒక గొప్ప గురువు. మాకు సహనాన్ని నేర్పిస్తుంది. బోట్ను మనం మంచిగా చూసుకుంటే, అది మనల్ని మంచిగా చూసుకుంటుందనే సూత్రాన్నే పాటిస్తాను. తరిణిలో మేమే ఇంజినీర్లం, ఎలక్ట్రీషియన్లం, కార్పెంటర్లం. వాతావరణ నివేదికల్ని అనుసరిస్తూ ప్రయాణం సాగించాలి. ఎనిమిది నెలల పాటు తరిణిలోనే మా నివాసం కాబట్టి పుస్తకాలు తెచ్చుకున్నా. కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్ ఇచ్చిన గిఫ్ట్స్, సంగీత వాద్య పరికరాలతోపాటు అమ్మ చేసిన ఊరగాయలు, కాలికట్ చిప్స్, టాపియోకా చిప్స్ తీసుకెళ్తున్నా. ఈ ప్రయాణం మొత్తానికి సరిపడా దోశల పిండి కూడా మా వెంట తీసుకువెళుతున్నాం. డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లేబొరేటరీ రూపొందించిన ప్రత్యేకమైన ఆహారాన్ని మాకు అందుబాటులో ఉంచారు' అని తెలిపింది లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా.

వీరి యాత్ర సఫలం కావాలని కోరుకుందాం.

– కరుకోల గోపీకిశోర్ రాజా, సాక్షి, విశాఖపట్నం

"ఇది నవరాత్రుల పవిత్ర సమయం. ప్రజలు దుర్గాదేవి పట్ల భక్తితో వివిధ మార్గాల్లో కలిసి మెలిసి పూజలు జరుపుకుంటున్నారు. ఈ సంతోషంతో ఆమె దయకు పరవశుడనై రాసిన 'ఆవతికలాయ్' అనే గర్బా గేయాన్ని ఇక్కడ ఉంచాను. ఆమె ఆశీస్సులు మనపై ఎప్పుడూ ఉండాలి" అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎక్స్లో పోస్ట్ చేశారు. గాయని పూర్వామంత్రి పాడిన ఈ గేయం గర్బా నృత్యానికి ఉన్న ప్రాధాన్యత తెలుసుకునేలా చేయడంతో పాటు ప్రతి మదిని ఆధ్యాత్మిక సౌరభమై తాకుతోంది. సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతోంది.



● భక్తి

ఆటా పాటగ మారిన స్త్రీశక్తి


గర్బా నృత్యం

గర్బా నృత్యం అనగానే సంప్రదాయదుస్తులు ధరించిన సమూహాలు, ఆనందంగా నృత్యం చేస్తున్న దృశ్యాలు మన కళ్లముందు మెదలుతాయి. ఆధ్యాత్మిక బలానికి మానసికోల్లాసాన్ని కలిపి జరుపుకునే ఈ వేడుక మొదట గుజరాతీ గ్రామాలలో పుట్టి, దేశ ఎల్లలు దాటి నేడు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

చిల్లులు గల మట్టి కుండలో దీపం వెలిగించి, తలపైన పెట్టుకుని అమ్మవారి విగ్రహం చుట్టూ వలయాకారంగా తిరుగుతూ భక్తి పారవశ్యంలో నృత్యం చేస్తారు. మట్టికుండ తల్లి గర్భాన్ని, జ్యోతి నుండి వెలువడే కాంతి లోపల పెరుగుతున్న కొత్త జీవిని సూచిస్తుంది. భక్తుల కోసం రాక్షసుడితో పోరాడిన దేవత పట్ల తమ ప్రేమ, కృతజ్ఞతలను ఈ నృత్యం ద్వారా తెలియజేస్తారు. మనలో ఉన్న అన్ని చెడులను నాశనం చేయడానికి, లోపల ఉన్న శక్తిని మేల్కొలిపే విధానంగా కూడా గర్బా నృత్యాన్ని చెబుతారు. గర్బా నృత్య రూపం స్త్రీత్వం, సంతానోత్పత్తిని తెలియజేస్తుంది. ఇందులో భజనలు, కీర్తనలకు చోటు ఎక్కువ. ఎక్కువ భక్తి ఆకర్షణను కలిగి ఉండే గర్బాను అమ్మవారి హారతికి ముందు నిర్వహిస్తారు.

కాలచక్రం .. పునరావృతం

దేవీ ఆరాధనలో భాగంగా చెప్పుకునే ఈ నృత్యాన్ని స్త్రీ–పురుషులు ఇద్దరూ తొమ్మిది రాత్రులు చేస్తారు. చాలా మంది ఈ తొమ్మిది రోజులూ కొన్ని ప్రత్యేక ఆహార నియమాలు, ఉపవాసాలు పాటిస్తారు. కాలచక్రం ఎప్పుడూ తిరుగుతూ పునరావృతం అవుతుంది. పుట్టుక నుంచి మరణం వరకు, మరణం నుంచి పునర్జన్మ వరకు ఆత్మ తిరుగుతూ ఉంటుంది. ఈ అన్ని అంశాల్లోనూ కదలకుండా నిరంతరాయంగా ఉండేది దైవశక్తి ఒకటే. దానికి ప్రతీకగా నృత్య వలయం మధ్య దేవీ ప్రతిమ లేదా పెద్ద దీపపు సెమ్మెను పెడతారు. జీవన చక్రం దాని చుట్టూనే పరిభ్రమిస్తుంటుందని చెప్పేందుకు ఇదొక ప్రతీక.

మహిషుని అంతం చేసిన మహిళా శక్తి

ఒక్క స్త్రీ చేతిలో తప్ప మరెవరి చేతిలోనూ మరణించకుండా ఉండాలన్న వరబలంతో మహిషాసురుడు తన శక్తులను చెడు కోసం ఉపయోగించడం ప్రారంభించాడు. అతడి దాడికి దేవతలు నిస్సహాయలైపోయారు. దుర్గాదేవి వద్దకు వెళ్లి, వేడుకున్నారు. దుర్గాదేవి ఒక్క కంటిచూపుతో ఆ రాక్షసుని అంతం చేయగలదు. కానీ, అసుర సంహారానికి ముందు తొమ్మిది పగళ్లు, తొమ్మిది రాత్రుల పాటు సాగిన సర్వోన్నతమైన యుద్ధం ద్వారా మానవాళికి గొప్ప సందేశాన్ని ఇచ్చింది. అసాంఘిక, అధార్మిక శక్తులు ఎంత బలంగా కనిపించినా, యుద్ధం ఎంతకాలం సాగినా, చివరికి ధర్మమే విజయం సాధిస్తుందని ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది. ఈ కథనాన్ని గర్బా నృత్యం ద్వారా ప్రదర్శించడం అంతర్లీనంగా కనిపిస్తుంది.

బేతే గర్బా

గుజరాత్లోని నాగర్ కమ్యూనిటీ 'బేతే గర్బా' అంటే కూర్చున్న గర్బా అని జరుపుకుంటారు. ఇక్కడ, భక్తులు ఒకరి ఇంటి వద్ద గుమిగూడి, గర్బా పాటలు పాడతారు. హిందువులు తమ పండుగలను బహిరంగంగా జరుపుకోవడాన్ని నిజాం నిషేధించినప్పుడు, ఇస్లామిక్ పాలనలో జునాగఢ్ లో బేతే గర్బా ప్రారంభమైంది. చాలామంది కఠినమైన ఉపవాస దీక్షలో ఉన్నప్పటికీ నృత్యం, సంగీతంతో ఉల్లాసంగా మారిపోతారు. ఉత్తర భారతదేశంలో గర్బా లో భక్తులు తబలా, మంజీరను ఉపయోగిస్తారు.

సంప్రదాయ దుస్తులతో...

ఈ నృత్యంలో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, శక్తి దేవత ఆశీర్వాదాలు కోరుకుంటూ నృత్యం చేస్తారు. గర్బా, దాండియా ఒకే విధంగా కనిపించినా, ఈ రెండింటికి వ్యత్యాసం ఉంది. గర్బాలో చేతులు, కాళ్లను సమన్వయంతో కదిలిస్తూ చేస్తారు. దాండియాలో కోలాటం కర్రలను ఉపయోగిస్తారు. గర్బా పాటలు దుర్గాదేవి, ఆమె అవతారాల చుట్టూ ఉంటే, దాండియాలో పాటలు కృష్ణుడి రాసలీలలపై ఉంటాయి.

పాదరక్షలు లేకుండా..

గర్బా దైవారాధనా రీతుల్లో చెప్పులు ధరించకపోవడం సకల జీవులకు ఆలవాలమైన భూదేవి పట్ల మనం చూపే గౌరవంగా భావిస్తారు. భూమిని నిరంతరం అంటి పెట్టుకుని ఉండే ఈ పాదాల ద్వారానే శరీరంలోకి శక్తి ప్రవాహం జరుగుతుందని నమ్మకం. ఆ దేవితో మనకు నేరుగా సంబంధాన్ని కల్పించేవి పాదాలే. అందుకే చెప్పులు లేకుండా చేసే ఈ నృత్యం పవిత్రమైన దైవారాధన వంటిది.

గర్బా.. యునెస్కో

నవరాత్రి ఉత్సవాలను గుజరాత్తో పాటు దేశంలోని అనేక ప్రాంతాలలో నిర్వహిస్తుంటారు. మన దేశానికే ప్రత్యేకమైన ఈ ప్రముఖ నృత్యాన్ని యునెస్కో 'ఇంటాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ ఆఫ్ హ్యూమానిటీ' (ఐసీహెచ్) జాబితాలో కిందటేడాది చేర్చింది. అమ్మవారి ఎదుట భక్తిని నృత్య రూపంలో చాటే ఈ ప్రాచీన సంప్రదాయం ఇప్పటికీ ఎప్పటికీ సజీవమే అనడానికి ప్రతీకగా నిలుస్తోంది గర్బా.

లీగల్

ఆ రియల్ ఎస్టేట్ సంస్థపై కేసు పెట్టచ్చు

ప్రశ్న: మేము లోన్ ద్వారా ఒక రియల్ ఎస్టేట్ సంస్థ వద్దనుంచి నిర్మాణదశలోనే ఫ్లాట్ కొన్నాము. ఒప్పందం ప్రకారం పది నెలల లోగా ఫ్లాటు మాకు పూర్తి చేసి ఇవ్వాలి. కానీ సంవత్సరం అయినా ఇంకా పూర్తి చేయలేదు. లోను నెలవారీ వాయిదాలు కట్టడం కూడా మొదలైంది. ఈ పరిస్థితుల్లో మేము ఏం చేయాలి? పరిష్కారం చెప్పగలరు.

– టి.ఆర్. రాజేశ్వరి, హైదరాబాద్

సర్వసాధారణంగా రియల్ ఎస్టేట్ సంస్థవారు, మీరు రాసుకునే ఒప్పంద పత్రం అంటే అగ్రిమెంట్లో సమయానికి ఫ్లాట్ నిర్మాణం పూర్తి చేసి, మీకు అందజేయకపోతే అందుకుగాను తాత్కాలిక పరిహారం/ఉపశమనం ఏం చేస్తారో రాసుకుంటారు. కొన్ని సందర్భాలలో ఫ్లాట్ అప్పగించేంతవరకు అద్దె ఇవ్వటం లేదా మీ తరఫున నెలవారీ లోను డబ్బులు సదరు కంపెనీ వారే కట్టేలా ఒప్పందాలు కూడా రాసుకుంటారు. మీ ఒప్పందపత్రంలో కూడా అటువంటి కండిషన్ ఏమైనా ఉందేమో చూసుకోండి. ఏది ఏమైనా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, మీరు సదరు రియల్ ఎస్టేట్ సంస్థపై వినియోగదారుల రక్షణ చట్టం కింద కేసు వేయవచ్చు. మీకు జరిగిన ప్రతి నష్టాన్ని లెక్కగట్టి దానికి తోడు మీకు కలిగిన మానసిక క్షోభకి కూడా అదనంగా పరిహారం కోరవచ్చు, పొందవచ్చు. అదనంగా... ఒకవేళ మీరు కొన్న ఫ్లాట్ (ప్రాజెక్టు రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) లో రిజిస్టర్ అయి ఉంటే అదనంగా రెరాకు కూడా ఫిర్యాదు చేయవచ్చు. మీ అగ్రిమెంటు, ఆస్తి కొనుగోలు పత్రాలు తీసుకొని దగ్గర్లోని లాయర్ని కలవండి.

మొదటగా ఒక నోటీసు పంపి, అప్పటికీ కూడా మీకు పరిష్కారం దొరకకపోతే, పైన తెలిపిన విధంగా దావా వేసి న్యాయం పొందవచ్చు. వినియోగదారుల చట్టం ప్రకారం మీ కేసు మీరు కూడా వాదించుకోవచ్చు లేదా మీ తరఫున మరెవరినైనా 'ఆథరైజ్డ్ పర్సన్'గా నియమించుకోవచ్చు. 50 లక్షల దావా వరకు జిల్లా వినియోగదారుల ఫోరంలో, 50 లక్షల నుంచి రెండు కోట్ల వరకు రాష్ట్ర ఫోరంలో అలాగే రెండు కోట్ల పైన విలువ గల దావాకి జాతీయ వినియోగదారుల ఫోరంలో మీ ఫిర్యాదును నమోదు చేయాల్సి ఉంటుంది.



– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.com కు మెయిల్ చేయవచ్చు.





దేవుడు తన రెండు కాళ్లనూ బలహీనపరిచినా.. అవరోధాలనే అవకాశాలుగా మలుచుకుని తన జీవితాన్ని, తానే నిలబెట్టుకున్నారామె. ఇప్పుడు తన లాంటి దివ్యాంగుల ఉద్ధరణకు నడుం బిగించి వారికీ బతుకుబాట చూపుతున్నారు.
ఆమే డీ హబ్ వ్యవస్థాపకురాలు కొప్పల వసుంధర. ఉన్న చోటే వారు వ్యాపారం చేసుకునేలా అవగాహన కల్పిస్తూ రిజిస్ట్రేషన్, పెట్టుబడి, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.
ఆమె ఇంటర్వ్యూని ఈ లింక్ను క్లిక్ చేసి సాక్షి @ నవశక్తిలో చూసేద్దాం.
https://www.youtube.com/watch?v=0c7--NycLyU

టెక్నాలజీ

స్వాగతం.. సుస్వాగతం



బెంగళూరులోని ఒక హోటల్లోకి అడుగు పెట్టిన అనన్య నారంగ్కు రిసెప్షనిస్ట్ స్వాగతం పలికింది.

అనన్యలో షాక్లాంటి ఆశ్చర్యం.

'ఇందులో ఆశ్చర్యపోవాల్సింది ఏముంది!' అనే కదా మీ డౌటు.

అయితే సదరు ఈ రిసెప్షనిస్ట్ సాధారణ రిసెప్షనిస్ట్ కాదు... వర్చువల్ రిసెప్షనిస్ట్!

'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా బెంగళూరులో వర్చువల్ రిసెప్షనిస్ట్' వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మన దేశంలో నవీన సాంకేతికత గురించి వివరంగా మాట్లాడుకునేలా చేస్తోంది.

'సాంకేతికత సహాయంతో తక్కువ సిబ్బందితో ఎక్కువ పనులను ఏకకాలంలో సమన్వయం చేస్తున్నారు. సిలికాన్ వ్యాలీలో తప్ప మన దేశంలో ఎక్కడా ఇలాంటి దృశ్యం కనిపించదు' అంటూ ఈ 'వర్చువల్ రిసెప్షనిస్ట్' ఫొటోని షేర్ చేసింది అనన్య.

'ఎంత సాంకేతిక ప్రగతి' అనే ప్రశంసల మాట ఎలా ఉన్నా... 'అబ్బబ్బే! ఇదేం ప్రగతి. అందమైన మానవ రిసెప్షనిస్ట్ స్వాగతం పలకడానికి, వర్చువల్ రిసెప్షనిస్ట్ స్వాగతం పలకడానికి చా...లా తేడా ఉంటుంది' అనే వాళ్లే ఎక్కువ!

● చిన్నారులపై జచింత

నెత్తుటేరుల అవార్డ్ నాకొద్దు


జసింతా కెర్కెట్టా

తన ఆదివాసీల సామాజిక, సాంస్కృతిక జీవితం గురించి లోతుగా రాయడమే కాదు పిల్లల ప్రపంచం గురించి కూడా రాస్తోంది కవయిత్రి జసింతా కెర్కెట్టా.

ఎక్కడ చూస్తే అక్కడ వారై – విశ్వరూపమున విహరిస్తున్న ఈ కాలంలో పిల్లల కోసం జసింత రాసిన 'జిర్హుల్' అనే పుస్తకానికి 'రూమ్ టు రీడ్ యంగ్ రైటర్–2024' అవార్డ్ ప్రకటించారు. పాలస్తీనాలో బాంబు దాడుల్లో మరణించిన, హింసకు గురవుతున్న పిల్లలను దృష్టిలో పెట్టుకొని ఈ అవార్డ్ను జసింత తిరస్కరించింది.

'రూమ్ టు రీడ్ ఇండియా' అనేది అక్షరాస్యత, లింగ సమానత్వం... మొదలైన వాటిపై పనిచేసే స్వచ్ఛంద సంస్థ. ఈ సంస్థకు ఏరోస్పేస్ దిగ్గజం 'బోయింగ్'తో సంబంధం ఉంది అని ఆరోపిస్తూ తనకు ప్రకటించిన అవార్డ్ను జసింత కెర్కెట్టా తిరస్కరించింది. 'బోయింగ్కు ఇజ్రాయెల్ సైన్యంతో 75 ఏళ్లుగా సంబంధం ఉంది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)కు ఆయుధాలను సరఫరా చేసే కీలక సంస్థ అయిన బోయింగ్ 'రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్'కు నిధులు అందజేస్తుంది' అని జసింత తన తిరస్కరణ కారణాలపై ఆ ట్రస్ట్కు లేఖ రాసింది.

'ఆయుధాలతో పిల్లల ప్రపంచం నాశనం అవుతున్నప్పుడు ఆయుధాల వ్యాపారం, పిల్లల సంరక్షణ ఏకకాలంలో ఎలా కొనసాగుతాయి?' అని ఆ లేఖలో ప్రశ్నించింది జసింత.

'సాహిత్యంలో వైవిధ్యమైన, పిల్లల కోసం రాస్తే పుస్తకాలు తక్కువగా వస్తున్నాయి. బాల సాహిత్యానికి సంబంధించిన జిర్హుల్ పుస్తకానికి అవార్డ్ రావడం సరియైనదే అయినా ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ అవార్డ్ను స్వీకరించలేను' అని చెప్పింది.

ఈ తిరస్కరణ మాట ఎలా ఉన్నా 'సాహిత్యానికి జసింత కెర్కెట్టా చేసిన కృషి విలువైనదిగా భావిస్తున్నాం' అని స్పందించింది 'రూమ్ టు రీడ్ ఇండియా' ట్రస్ట్. ఇప్పుడు మాత్రమే కాదు సామాజిక కారణాలతో తనకు వచ్చిన కొన్ని అవార్డ్లను గతంలోనూ తిరస్కరించింది జసింత.

పిల్లల్లో సామాజిక చైతన్యం

పిల్లలూ... మీరు ఎన్ని పువ్వుల గురించి విన్నారు? పూలన్నింటి గురించి తెలియనప్పుడు, కొన్ని పువ్వుల గురించి మాత్రమే తెలిసినప్పుడు... అవి మాత్రమే గొప్ప పుష్పాలూ, ప్రత్యేకమైన పుష్పాలూ ఎలా అవుతాయి? ఇవి మాత్రమే కాదు జిరాహుల్, జతంగి, సోనార్ఖి, సరాయ్, కోయినార్, సనాయ్ లాంటి ఎన్నో పూలు ఉన్నాయి' అంటూ పది పువ్వుల గురించి జసింత కవిత్వం రాసింది. ఈ పువ్వుల గురించి ఎప్పుడూ వినని, ఎప్పుడూ చూడని పిల్లలు కూడా జసింత రాసిన కవిత్వం చదివి, పక్కన ఉన్న బొమ్మలు చూస్తే ఎక్కడ ఏ పువ్వు కనిపించినా ఇట్టే గుర్తు పట్టేస్తారు.

ఈశ్వర్ ఔర్ బజార్, జసింతా కీ డైరీ, ల్యాండ్ ఆఫ్ ది రూట్స్తో సహా ఏడు పుస్తకాలు రాసింది.

'జిర్హుల్'లో పువ్వుల ప్రపంచం కనిపించినప్పటికీ అది అణగారిన వర్గాల కోసం ప్రతీకాత్మకంగా రాసిన పుస్తకం. ఆదివాసీ సంస్కృతి ఆధారంగా చేసుకొని పిల్లల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడమే ఈ పుస్తక లక్ష్యం. గాజాలో పదహారువేల మందికి పైగా చిన్నారులు మరణించారు. నెత్తుటేరులు పారాయి. ఈ నేపథ్యంలో 'రూమ్ టు రీడ్ యంగ్ రైటర్' అవార్డ్ను జసింత తిరస్కరించింది.



ఉద్యమ నేపథ్యం...

ఝార్ఖండ్లోని ఖుదపోష్ గ్రామంలో ఆదివాసీ కుటుంబంలో పుట్టిన జసింత మాస్ కమ్యూనికేషన్, వీడియో ప్రొడక్షన్లో డిగ్రీ చేసింది. రాంచీలోని ఒక ప్రముఖ దినపత్రికలో పని చేసింది. కెరీర్ పరంగా ఎంత ముందుకు వెళ్లినా తన మూలాలను మాత్రం మరవలేదు. 'ఆదివాసీ అండ్ మైనింగ్ ఇన్ ఫైవ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఝార్ఖండ్' పేరుతో అధ్యయన పత్రాన్ని వెలువరించింది.

'ఇండిజినస్ వాయిస్ ఆఫ్ ఆసియా' అనే పరిశోధన పత్రానికి ఇండిజినస్ పీపుల్స్ ప్యాక్ట్ అవార్డు లభించింది. జర్నలిస్ట్గానే కాదు కవిత్వానికి సంబంధించి సృజనాత్మక రచనలతోనూ ఎన్నో అవార్డ్లు అందుకుంది. తన కవిత్వం విషయానికి వస్తే అది ఆకాశపల్లకిలో ఊరేగదు. జ్ఞాపకాలను నెమరు వేసుకునేలా ఉంటుంది. గాయాలను గుర్తు తెచ్చుకునేలా ఉంటుంది. బూటకపు అభివృద్ధిని ప్రశ్నించేలా ఉంటుంది.

జసింత మనోహర్పూర్లోని మిషనరీ బోర్డింగ్ స్కూల్లో చదువుతున్న రోజుల్లో తల్లి పుష్ప అనిమ తండ్రి చేతిలో తరచు హింసకు గురయ్యేది. మరచిపోలేని ఆ హింసాత్మక దృశ్యాలు తన కవిత్వంలో కనిపిస్తాయి. వ్యక్తిగత చేదు అనుభవాలే కాదు అభివృద్ధి పేరుతో ఆదివాసీ గ్రామాల్లో జరుగుతున్న విధ్వంసం కూడా జసింత కవిత్వంలో కనిపిస్తుంది.

జసింత కెర్కెట్టా జర్నలిస్ట్ మాత్రమే కాదు సోషల్ యాక్టివిస్ట్ కూడా. బాలికల విద్యకు సంబంధించి ఎన్నో ఆదివాసీ గ్రామాల్లో పనిచేసింది. ఫోర్బ్స్ ఇండియా 'టాప్ 20 సెల్ఫ్మేడ్ ఉమెన్'లో ఒకరిగా ఎంపిక అయింది.